జిల్లాలో రైతాంగ సమస్యలు పరిష్కరించాలి...

సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ

విశాలాంధ్ర-పలాస : జిల్లాలో ఉన్న అన్ని వర్గాల రైతాంగ సమస్యలను పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ అన్నారు.శనివారం పలాస సిపిఐ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీడిపంటకు మద్దతు ధర ప్రకటిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ ఇంతవరకు అమలుకు నోచుకోలేదని , జీడిపంట దిగుబడి కాలంలో విదేశాల నుండి జీడి పిక్కలు దిగుమతి ఆపాలని ఆర్బికే కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి 80 కేజీల బస్తాకు 16 వేల రూపాయలు ధర ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. గత ఐదేళ్లగా స్థానిక మంత్రి డా. సీదిరి అప్పలరాజుకు అనేకసార్లు తెలియజేసినప్పటికీ ప్రతి సంవత్సరం మద్దతు ధర ప్రకటిస్తామని కాలయాపన చేశారని ఆయన విమర్శించారు. గత ఆరు సంవత్సరాల నుంచి నందిగాం, పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు వంశధార సాగునీరు అందడం లేదని శివారు ప్రాంత రైతులు వర్షాలు లేక కాలువల నీరు అందక కరువు బారిన పడ్డారని, కరువు రైతాంగానికి ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టలేదని విమర్శించారు. ప్రతి ఎకరాకు 20వేల రూపాయలు పంటసాయం చేయాలని యుద్ధ ప్రాతిపదికన కరువు సహాయక చర్యలు చేపట్టి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే వంశధార కాలువ పూడికలు తీయించి శివారు భూముల రైతులకు సాగునీరు అందించాలని కోరారు. ఉపాధి హామీ కూలీలకు దినసరి వేతనం 600 రూపాయలు ఇవ్వాలని 200 రోజులు పని దినాలు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు చాపర వేణుగోపాల్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, సిహెచ్ రవి, గోరు వాసు తదితరులు పాల్గొన్నారు.

జి. సిగడాంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నవీకరించిన డాక్టర్ రెడ్డీస్

- అత్యాధునిక సదుపాయాలతో ఉన్నతాధికారులకు అప్పగింత

విశాలాంధ్ర-రణస్థలం : తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా జిల్లా యంత్రాంగం, జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయంతో కలిసి డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్, డాక్టర్ రెడ్డీస్ సంస్థ ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నవీకరించాయి. వాటిని ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండల కేంద్రంలో గ్రామవాసులకు అప్పగించారు. నవీకరించిన ఈ కేంద్రంలో అత్యాధునిక డయాగ్నస్టిక్ సదుపాయాలు, మౌలిక వసతులు, హెమటాలజీ ఎనలైజర్, కాగ్యులేషన్ ఎనలైజర్, డ్రై బాత్ ఇంక్యుబేటర్, బయోకెమిస్ట్రీ ఎనలైజర్ లాంటి పరికరాలు ఉన్నాయి. ఎస్‌టీపీలు, బీఈఎంఓఎన్‌సీ, ఇన్ఫెక్షన్ నివారణ, నియంత్రణ లాంటి చికిత్సలలో శిక్షణ పొందిన సిబ్బంది ఈ కేంద్రంలో ఉన్నారు. అంతేకాక ఇక్కడ నిరంతరం శుద్ధి చేసిన నీటి సరఫరా, నిరంతరాయంగా విద్యుత్తు, ద్రవ వ్యర్థాల నిర్వహణ వ్యవస్థ కూడా ఉన్నాయి. ఇక్కడి ల్యాబ్‌లో కోల్డ్ చైన్ నిర్వహణకు కావల్సినట్లుగా ఉష్ణోగ్రతలు నిర్వహించడానికి కావల్సిన ఎయిర్ కండిషనర్, రిఫ్రిజిరేటర్ ఉన్నాయి. గాజు తలుపులతో కూడిన షెల్ఫులు ఉండటంతో మందులు తగిన విధంగా కనిపిస్తాయి. మందులను వీఈడీ (వైటల్, ఎసెన్షియల్, డిజైరబుల్) అనే విభాగాలుగా చేసి, నిల్వల కొరత లేకుండా చూస్తున్నారు. లిఫో (లాస్ట్ ఇన్ ఫస్ట్ ఔట్), ఫిఫో/ఫెఫో (ఫస్ట్ ఇన్ ఫస్ట్ ఔట్/ఫస్ట్ ఎక్స్‌పైరీ ఫస్ట్ ఔట్) లాంటి ఇన్వెంటరీ టెక్నిక్‌లు పాటిస్తూ మందులు కాలపరిమితి తీరిపోకుండా జాగ్రత్త పడుతున్నారు. మొత్తమ్మీద, ఈ ప్రాజెక్టులో మౌలిక సదుపాయాల మెరుగుదల, పచ్చదనం పెంపు, నాణ్యతా ప్రమాణాలకు కట్టుబడి ఉండటం ద్వారా సమగ్ర ఆరోగ్య సేవలు అందిస్తున్నారు. మొత్తం 3.25 ఎకరాల ప్రాంగణంలో 2,650 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ కేంద్రం జి.సిగడాం మండలంలోని 32 గ్రామాల్లోని 7,783 కుటుంబాలకు చెందిన 31,851 మంది జనాభాకు సేవలు అందిస్తుంది. ఈ పీహెచ్‌సీ పరిధిలో 10 గ్రామ సచివాలయాలు, 9 వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. గ్రామస్థులకు అందజేసే కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజిర్ జిలానీ సామూన్, శ్రీకాకుళం డీఎంహెచ్ఓ బి. మీనాక్షి, శ్రీకాకుళం ఆర్డీవో సీహెచ్ రంగయ్య, జి.సిగడాం మండల తహసీల్దార్ ఎస్. నిర్మల, డాక్టర్ రెడ్డీస్ సంస్థ, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా, విభజన హామీలు అడిగితే అరెస్టులా..?

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయాలని కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ విషయమై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అఖిలపక్ష సమావేశం తక్షణమే ఏర్పాటు చేయాలని కోరుతూ విద్యార్థి యువజన సంఘాల పిలుపుమేరకు చలో సీఎం క్యాంప్ కార్యాలయంనకు వెళుతున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు, ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులను అక్రమ అరెస్టులు దారుణమని, అరెస్టులను ఖండిస్తున్నామని ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి జిల్లా అధ్యక్షులు జి.నర్సు నాయుడు, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి హరీష్‌లు తెలిపారు. స్థానిక ఎన్ఆర్ దాసరి క్రాంతిభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తిరుపతి సభలో ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పిన వాగ్దానాన్ని అమలు చేయమని అడిగితే అరెస్టులు చేయడం ఏమిటని, కేంద్రం మెడలు వంచి హోదా తీసుకొస్తానని మాట ఇచ్చిన సీఎం జగన్ ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నిస్తే కేసులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఏపీకి ప్రత్యేక హోదా విభజన చట్ట హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 25 మంది వైసీపీ ఎంపీలను గెలిపిస్తే కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నప్పటికీ కేంద్రం మెడల వంచి ప్రత్యేక హోదా సాధిస్తానని ఆనాడు ప్రగల్భాలు పలికిన జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత మాట మార్చి, మడమ తిప్పారని విమర్శించారు. నాలుగున్నర ఏళ్లగా జగన్మోహన్ రెడ్డి కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వానికి దాసోహంగా ఉంటూ రాష్ట్ర ప్రజల హక్కులను మోడీ కి తాకట్టు పెట్టారని దుయ్యబట్టారు. ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చలసాని శ్రీనివాస్, జేడీ లక్ష్మీనారాయణలను అరెస్టు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పోలీసులను ప్రయోగించి ప్రజా ఉద్యమాలను అణిచివేసేందుకు వైసీపీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో భావ ప్రకటన స్వేచ్ఛను హరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదా అనేది ముగిసిన అధ్యాయం కాదన్నారు. బిజెపి ప్రభుత్వం ఈ రాష్ట్రాన్ని మోసం చేసిందని ప్రజాతంత్ర వాదులంతా ఈ అక్రమ అరెస్టులను, రాష్ట్ర ప్రభుత్వ, పోలీసు చర్యలను ఖండించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి. చందు, ఏఐవైఎఫ్ నరసన్నపేట నియోజకవర్గ నాయకులు అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాలు

రూ.1.8 కోట్లతో ఉప ఖజానా కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి

విశాలాంధ్ర-పలాస : ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కట్టించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానిదేనని రాష్ట్ర పశు సంవర్ధక, డైరీ అభివృద్ధి మరియు మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద 1.08 కోట్ల రూపాయలతో నిర్మించిన ఉప ఖజానా కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, ప్రజల సౌకర్యార్థం ఉప ఖజానా కార్యాలయ భవనం నిర్మించినట్లు వివరించారు. ఉద్యోగులు, పింఛన్ దారులు కార్యాలయ సేవలు సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. గత పాలకుల హయాంలో చాలీచాలని వసతులతో ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు,ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థలో ఉద్యోగుల ప్రజల ఇబ్బందులు తొలగించడానికి లక్షల రూపాయల బడ్జెట్ తో అన్ని హంగులతో ప్రభుత్వ కార్యాలయాలను నిర్మిస్తున్నా రన్నారు. టిడిపి పాలన కాలంలో పంచాయతీలో సర్పంచ్ కూర్చోవడానికి కుర్చీ కూడా లేని పరిస్థితులు ఉండేవని గుర్తు చేశారు. సచివాలయ పరిధిలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించి ప్రారంభిస్తున్నామని వివరించారు.ప్రజలకు అన్ని సౌకర్యాలతో కార్యాలయాలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకమైన పాలన అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ట్రెజరర్ సిహెచ్ రవి కుమార్, పలాస ఆర్డిఓ డాక్టర్ భరత నాయక్, పలాస సబ్ ట్రెజరర్ ఎల్ రామారావు, పలాస మార్కెట్ కమిటీ చైర్మన్ పి వి సతీష్, పలాస పిఎసిఎస్ అధ్యక్షులు పైల చిట్టి, పట్టణ వైసీపీ అధ్యక్షులు సనపల సింహాచలం, పలాస మండల జేసీఎస్ కన్వీనర్ దువ్వాడ రవి, పట్టణ జెసిఎస్ కన్వీనర్ బల్ల శ్రీను, వైయస్సార్ పార్టీ అధికార ప్రతినిధి శిష్టు గోపి, ఎన్జీవో సంఘ అధ్యక్షులు బోనెల గోపాల్, విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు తమ్మినేని మాధవరావు, నెమలిపూరి అప్పారావు, సుడియా సత్యన్నారాయణ, చింతాడ మాధవరావు, త్యాడి తదితరులు పాల్గొన్నారు.

పలాస నుండి బరంపురంకు డి.ఎం.యు రైలు పొడిగింపు

బిజెపి ఎంపి జి.వి.ఎల్.కు ధన్యవాదాలు తెలిపిన బిర్లంగి



విశాలాంధ్ర-అరసవల్లి : బిజెపి రాజ్యసభ సభ్యులు జీవిఎల్ నరసింహారావు చొరవ కారణంగా డిఎంయు పాసింజర్ రైలు బరంపురం వరకు పొడిగించారు. దీంతో శ్రీకాకుళం పార్లమెంటు జిల్లాలోని పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గం ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మందస, హరిపురం ఇచ్ఛాపురం లో డిఎంయు హాల్ట్ ఉండడం కారణంగా స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి దశాబ్దకాలంగా డి.ఎం.యు పాసింజర్ హాల్ట్ కావాలని ఇచ్ఛాపురం, మందస, కంచిలి, జాడుపూడు బరంపురం ప్రజలు కోరుకుంటున్నారు. మూడు నెలలు కిందట రాజ్యసభ సభులు జీవిఎల్ నరసింహారావు శ్రీకాకుళం పర్యటనకు విచ్చేసిన సందర్భంలో ఇచ్ఛాపురం, మందస బరంపురం నుండి భాజపా కార్యకర్తలు శ్రీకాకుళం పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు ద్వారా ఎంపి జీవిఎల్ నరసింహారావుకు డి.ఎం.యు రైలు పొడిగించేలా చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందించారు. తరువాత జీవీఎల్ నరసింహారావు గారు స్థానిక సమస్యను రైల్వే మంత్రి అశ్విన్ శ్రీవైష్ణవ్ మరియు రైల్వే జీఎం లకు తెలిపినట్టు సమాచారం అందించారు. ఎట్టకేలకు డి.ఎం.యు పాసింజర్ రైలు వైజాగ్ నుండి పలాస వరకు నడిచేది ఇక పై ఇచ్ఛాపురం మీదుగా బరంపురం వెళ్లనుందని రైల్వే శాఖ తెలియజేసింది. దీంతో భాజపా కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి పరిష్కరించలేని స్థానిక ప్రాంతీయ పార్టీల నాయకత్వం భాజపా శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు చొరవతో భాజపా ఎంపి జీవిఎల్ నరసింహారావు సహకారంతో సాధ్యమైందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంపి జీవిఎల్ సమయం ఇస్తే వారికి ఘనంగా సత్కరించాలని ఇచ్ఛాపురం మందస వాసులు ఉత్సాహం చూపుతున్నారు. ఈ మేరకు శ్రీకాకుళం పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావుకు సర్వత్రా శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

- పల్స్ పోలియో కార్యక్రమానికి సిద్ధం
- ఆరోగ్య విస్తరణ అధికారి డా. నల్లి రవికుమార్

విశాలాంధ్ర-పోలాకి: పోలియో మహమ్మారి నుంచి చిన్నారులను కాపాడుకునేందుకు ఏటా ప్రభుత్వం పల్స్‌పోలియో కార్యక్రమం చేపడుతోంది. దీనిలో భాగంగా 1వ తేదీన పోలాకి పిహెచ్‌సిలో వాక్సినేటర్ శిక్షణ జరిగింది. ఈ శిక్షణలో భాగంగా పోలాకి మండల పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో 65 గ్రామాల్లో 27 బూత్‌ల పరిధిలో ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కల మందు అందించనున్నామని వైద్యాధికారి డాక్టర్ శ్రీనాథ్ అన్నారు. ఈమేరకు దానల్లి రవికుమార్ ఆరోగ్య విస్తరణాధికారి ఒక ప్రకటనను విడుదల చేశారు. పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో గల ఏడు ఉప కేంద్రాలు మరియు 14 సచివాలయాల, 65 గ్రామాల పరిధిలో ఉన్న 2929 మంది ఐదేళ్ల లోపు వయసు పిల్లలున్నారని వీరికి పోలియో చుక్కలు వేసేందుకు జిల్లా నుంచి 206 పోలియో వైల్స్ సరఫరా అయినాయని తెలిపారు. సంచార జాతులు, భిక్షాటన చేసేవారు, ఇటుక బట్టీ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, మురికివాడలు, ఆదివాసీ పిల్లలపై సిబ్బంది ఈసారి ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు రవికుమార్ ఈ ప్రకటన లో తెలిపారు. ఈ క్రమంలోనే ముగ్గురు రూట్ సూపర్‌వైజర్లు, ఒక సంచార బృందము, 13 మంది ఎంఎల్‌హెచ్‌పీలు, 12మంది ఏఎన్ఎంలు, 47మంది ఆశాకార్యకర్తలు, 69మంది అంగన్వాడీలు పల్స్‌పోలియో కార్యక్రమంలో పాల్గొనబోతున్నరని ఆదివారం పోలియో చుక్కలు వేసుకోని చిన్నారులను ప్రత్యేక బృందాల సాయంతో గుర్తించి. అనంతరం ఇంటింటికీ తిరిగి ఆయా చిన్నారులకు సోమ మరియు మంగళవారం పోలియో చుక్కలు వేయనున్నారనీ తెలిపారు. కార్యక్రమంలో పిహెచ్ఎన్ఎం ఈశ్వరమ్మ, శేఖర్, లక్ష్మి అంగన్వాడీ సూపర్వైజర్‌లు దుర్గమ్మ, శ్రీదేవి, ఏఎన్ఎంలు, హెల్త్‌అసిస్టెంట్‌లు అంగన్వాడీ టీచర్స్ మరియు ఆశాలు పాల్గొన్నారు.

సమీకృత కలెక్టరేట్ పనులు త్వరగా పూర్తి చేయాలి

కలెక్టర్ డా మనజిర్ జిలానీ సమూన్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: సమీకృత కలెక్టర్ కార్యాలయ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మనజిర్ జిలాని సమూన్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న సమీకృత కలెక్టర్ కార్యాలయ భవన సముదాయాన్ని జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, రహదారులు, భవనాలశాఖ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఫిబ్రవరి 17వతేది పర్యటనలో నాటి పనుల్లో పురోగతి, నిర్దేశించిన పనులపై ఆరాతీశారు. నాణ్యతలో రాజీ లేకుండా పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా రెవెన్యూ అధికారి ఎం. గణపతి రావు, ఆర్ అండ్ బి ఎస్ఈ జాన్ సుధాకర్, ఈఈ రవి నాయక్, డిఈఈ ఎం.ఎల్.వి.సాగర్, ఏఈఈ పి.టీ.రాజు, కాంట్రాక్టు ప్రతినిధి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

చొట్రాయిపురం పాఠశాల పరిశీలన

విశాలాంధ్ర-సోంపేట/కంచిలి : కంచిలి మండలం చొట్రాయిపురం గ్రామంలో ఎంపీపీ స్కూల్‌ను ఎంఈఓ చిట్టిబాబు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సమయంలో విద్యార్థులు నిర్వహించిన ప్రార్థన, ప్రతిజ్ఞ, సూక్తి, జనరల్ నాలెడ్జ్ పొడుపు కథలు, చిలిపి ప్రశ్నలు, మొదలైన వాటి పట్ల విద్యార్థుల తీరును అభినందిస్తూ ప్రధానోపాధ్యాయుడు, ప్రముఖ గణిత అవధాని మద్దు తిరుపతిరావును అభినందించారు. పాఠశాల రికార్డ్స్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

పోలింగ్ స్టేషన్‌లు తనిఖీ

విశాలాంధ్ర-పోలాకి : వస్తున్న ఎన్నికల పట్ల మౌలిక వసతులు ఏర్పాట్లపై తనిఖీ నిర్వహించినట్లు ఎస్సై వి.సత్యనారాయణ తెలిపారు. శనివారం ప్రియాగ్రహారం గరిమెళ్ళ సత్యనారాయణ ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. అనంతరం 261, 262 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పలు రకాల వసతులు సౌకర్యాలపై బిఎల్‌ఓ కార్తీక్‌ను అడిగి తెలుసుకున్నారు. రామయ్యవలసలో ఉన్న 263 పోలింగ్ స్టేషన్‌లో సౌకర్యాలు లేనితో ఉండడంతో చర్యలు తీసుకోవాల్సిందని చెప్పారు.ఆయనతో పాటు కానిస్టేబుల్ వాసు రెవిన్యూ సహాయకులు టి ఆశిరయ్య ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-పొందూరు : మండలం పొందూరు, లోలుగు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఎస్ భయ్యన్నాయుడు. స్థానిక ఏఈ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటలవరకు పొందూరు, రాపాక, కోటిపల్లి, వీఆర్ గుడెం, తండ్యాం, మలకాం, కొంచాడ, లోలుగు, దళ్ళిపేట, బి.కంచరాం, నందివాడ, గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని చెప్పారు.

నీలకంఠాపురంలో గడపగడపకు ఎమ్మెల్యే రెడ్డి శాంతి

విశాలాంధ్ర-కొత్తూరు : మండలం నీలకంఠాపురం పంచాయితీలో శనివారం ఎమ్మెల్యే రెడ్డి శాంతి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంతవరకు ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకోసం అమలుచేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు కరపత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్ ను ఎమ్మెల్యే శాంతి ప్రారంబించారు. అనంతరం ఈ పంచాయితీ పరిధిలోని ఎన్నిరామన్న పేట గ్రామంలో టీడీపీ నుండి వైసీపీ పార్టీలో చేరిన వార్డ్ మెంబర్ ముకుందరావు పలు కుటుంబాలను ఎమ్మెల్యే శాంతి పార్టీ కండువా కప్పి వారిని స్వాగతించారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యేతోపాటు పియేసియేస్ ఛైర్మెన్ చింతాడ సూర్యనారాయణ మాజీ సర్పంచ్ తిర్లంగి కృష్ణ మోహన్ వైసీపీ నాయకులు మతం పూర్ణా, గేదల చిన్నబాబు, ఎల్.తిరుపతిరావు, జి.నాగేంద్ర తదితరులున్నారు.

తాడివలస బిఎల్‌వోపై విచారణ

విశాలాంధ్ర-పొందూరు: మండలం తాడివలస పంచాయతీలో 134 బిఎల్వో, గ్రామసచివాలయ మహిళా రక్షణాధికారి కూన ఉమమహేశ్వరిపై గ్రామసర్పంచ్ తమ్మినేని మనెమ్మ ఎన్నికల కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ ఆదేశాలతో శనివారం సచివా లమంలో ఈఆర్వో అప్పారావు, తహసీల్దార్ ఎం.పాల్ కిరణ్ విచారణ చేపట్టారు. అధికార పార్టీకి అనుకూలంగా పనిచేస్తుందని, గ్రామానికి చెందిన వ్యక్తికావడమే కాకుండా రాజకీయ కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో ఎన్నికల ప్రక్రియలో పక్షపాతంగా వ్యవహరిస్తోందని ఎన్నికలలో ఓటర్లపై ప్రభావితం చూపే అవకాశం ఉందని సర్పంచ్ ఎన్నికల సంఘానికి ఇచ్చిన పిర్యాదులో పేర్కొన్నారు. పిర్యాదు మేరకు సచివాల యంలో గ్రామస్తులతో విచారణ చేపట్టారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు. ఎన్నికల సంఘానికి నివేదిస్తామని తహసీల్దార్ పాల్ కిరణ్ తెలిపారు. ఈ విచారణలో సిఎస్ డీటీ వెంకటేశ్వర రామానుజులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో యుటిఎఫ్ నాయకులు వినతి

విశాలాంధ్ర-టెక్కలి : సిపీఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపిఎస్ విధానాన్ని పునరుద్ధరించాలనే ఉద్యోగ సంఘాల డిమాండ్ అమలుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని శ్రీకాకుళం డిసిసి అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఈ హామీని చేర్చాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లా యుటిఎఫ్ నాయకులు పాలవలస ధర్మారావు, కురమాన దాలయ్య, తమ్మినేని వైకుంఠ రావు లు డిసిసి అధ్యక్షులు డాక్టర్ పేడాడను టెక్కలి క్యాంపు కార్యాలయంలో కలసి శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎస్ విధానం వల్ల పదవీ విరమణ చేసిన ఉద్యోగుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు .పింఛన్ అనేది దేశ సేవ చేసినందుకు ఉద్యోగస్తులకు ప్రభుత్వం కల్పించే భరోసాగా కాంగ్రెస్ పార్టీ గుర్తిస్తుందని, కాంగ్రెస్ పార్టీ పాలనలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు సుఖశాంతులతో ఉన్నారని ఆయన గుర్తు చేశారు .ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఓపీఎస్ విధానాన్ని అమలు చేస్తుందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఓపీఎస్ విధానాన్ని అమలు చేస్తామని, ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామనీ తమ పిసిసి అధినేత వైయస్ షర్మిలా రెడ్డి ఇప్పటికే హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మాత్రమే ప్రజలకిచ్చిన హామీలు తూచా తప్పకుండా అమలు చేస్తుందని స్పష్టం చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగ కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున ఇండియా కూటమికి సహకరించి, విజయానికి దోహదపడాలని ఆయన ఈ సందర్భంగా తనను కలిసిన నాయకులకు విజ్ఞప్తి చేశారు.

పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-కవిటి: నేడు జరగబోయే పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలని ప్రధానోపాధ్యాయుడు దేవదాసు ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ కార్యక్రమం చేపట్టారు.ఈ మేరకు శనివారం మండలంలోని పెద్ద ఎర్రగోవిందపుట్టుగ గ్రామంలో మండల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవదాస్, విద్యార్థులు, గ్రామస్తులు పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ చేపట్టారు. పోలియో చుక్కలతోనే పోలియో నివారణ సాధ్యపడుతుందని అప్పుడే పుట్టిన చిన్నారి నుండి ఐదు సంవత్సరాలలోపు చిన్నారులు రెండు చుక్కల పోలియో చుక్కలు వేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ నీల, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాలకు మంచినీటి సరఫరా

విశాలాంధ్ర-కాశీబుగ్గ : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో అన్ని ప్రాంతాల్లో మంచినీరు ట్యాంకర్లు ద్వారా సరఫరా చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. శనివారం పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో ట్యాంకర్లు ద్వారా మంచినీటి సరఫరా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో నీటి ఎద్దడి ప్రాంతాల్లో గుర్తించి నీటిని సరఫరా చేస్తామని, ఎవైనా మంచినీటి సమస్యలుంటే మున్సిపల్ అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు పాల్గొన్నారు.

ఉద్యోగమే లక్ష్యంగా డిగ్రీ కళాశాలలో విద్య

విశాలాంధ్ర-పలాస : ఉద్యోగమే లక్ష్యంగా పలాస ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్య అందించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ గోవిందమ్మ అన్నారు.శనివారం శ్రీకాకుళం మెన్స్ డిగ్రీ కళాశాలలో జరిగిన జాబ్ మేళాలో పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల చెందిన ఫైనల్ ఇయర్ స్టూడెంట్స్ 21 మంది హాజరు కాగా అందులో 10 మంది ఎంపిక అయ్యారని తెలిపారు. నలుగురు విద్యార్థులకు డెక్కన్ కెమికల్స్‌లో ఉద్యోగం వచ్చిందని, మిగిలిన ఆరుగురుకు ఐసిఐసిఐ బ్యాంకులో ఉద్యోగం వచ్చిందని వారికి నియామక పత్రాలు అందచేశారని ఆమె తెలిపారు.

7 కేసుల్లో 21 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

నరసన్నపేట, కాశీబుగ్గ పోలీసులకు అభినందనలు తెలిపిన ఎస్.పి రాధిక

విశాలాంధ్ర-నరసన్నపేట : శ్రీకాకుళం జిల్లా ఎస్పీ, జి.ఆర్.రాధిక ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లో బంగారు ఆభరణాలు దొంగిలించిన ముఠాను నరసన్నపేట, కాశీబుగ్గ పోలీసులు చాకచక్యంగా పట్టుకొని, వారి నుండి బంగారు ఆభరణాలు శనివారం స్వాధీనం చేసుకున్నారు. శనివారం స్థానిక సి.ఐ కార్యాయలంలో జిల్లా ఎస్పీ, రాధిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ సంవత్సరం ఫిబ్రవరి, 23వతేదీ నరసన్నపేటలోని శ్రీరాంనగర్‌లో నివాసముంటున్న జామి వరలక్ష్మీ మెడలో మూడున్నర తులాల బంగారు ఆభరణాలు ద్విచక్ర వాహనంపై వచ్చి, అపహరించి వెళ్ళిపోయారని తెలిపారు. అనంతరం సిసి కెమెరాలు, మాకు రావల్సిన సమాచారం మేరకు నేడు నరసన్నపేట మండలంలోని జమ్ము జంక్షన్ వద్ద ఒడిస్సా రాష్ట్రం, బరంపురంకు చెందినటు వంటి, శంకర్, సురేష్ అనే ఇద్దరిని పట్టుకొవటం జరిగింది. వీరి నుండి సుమారు 21తులాల ముప్పావు బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకోవటం జరిగిందని అన్నారు. ఈ దొంగతనాలు నరసన్నపేట పట్టణానికి చెందినవే కాకుండా విశాఖపట్నం సిటీలో రెండు, విజయనగరంలో రెండు, పార్వతీపురం మన్యంలో రెండు మొత్తం ఏడు చైన్ స్నాచింగ్ కేసుల్లో 8చైనులు, 5ఫేక్ నెంబర్ ప్లేటులు, రెండు చాకులు, ఒక నాటు తుపాకి కాకుండా బంగారు ఆభరణాలు కరిగించే సామగ్రి స్వాధీనం చేసుకున్నామని అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా శంకర్, సురేష్ అనే వ్యక్తులు మహిళలకు చాకులు, తుపాకితో బెదిరించి బంగారు ఆభరణాలు దొంగిలిస్తున్నారని తెలిపారు. వీరిద్దరినీ పట్టుకొవటానికి పూర్తి సమాచారాన్ని సేకరించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగాని అలెర్ట్ చేశామని, దొంగలను పట్టుకునేందుకు సహకరించిన కాశీబుగ్గ ఎస్ఐ, పారినాయుడు, నరసన్నపేట ఎస్.ఐ, అశోక్‌బాబు, హెడ్ కానిస్టేబుళ్ళు, శ్రీనివాస్, నీలకంఠం, భాస్కరరావు, నరసన్నపేట సిఐ, ప్రసాదరావు, టెక్కలి ఎస్‌జీపివో, బాలచంద్రారెడ్డి, ఎడిషినల్ జిల్లా ఎస్పీ, ప్రేమ్ కాజల్‌కు ఎస్పీ, జి.ఆర్.రాధిక అభినందనలు తెలియచేశారు.

దేవాలయాల్లో చోరీకి యత్నం



విశాలాంధ్ర -జలుమూరు/సారవకోట: సారవకోట మండలం బుడితి గ్రామ పరిధిలో అయ్యప్ప, శిర్డీ సాయిబాబా, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలలో దుండగులు చోరీకి యత్నించారు. ఆలయాల తాళాలు విరగ్గొట్టి లోపలికి ప్రవేశించారు. అయితే అధికమొత్తంలో నగదు లేకపోవడంతో హుండీలు విడిచిపెట్టి, తాళాలు దూరంగా విసిరేశారు. సీసీ కెమెరాల హార్డ్ డిస్క్ తొలగించి తీసు కెళ్లారు. ఈ మేరకు పోలీసులు కేసునమోదు చేశారు.

ప్రతి ఇంటికీ శుద్ధజలం

విశాలాంధ్ర -వజ్రపుకొత్తూరు : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి 700 కోట్ల రూపాయలతో ప్రవేశ పెట్టిన వైఎస్ఆర్ ఇంటింటికి శుద్ధజలం ప్రాజెక్టు ద్వారా ప్రతి ఇంటింటికి శుద్ధజలం సరఫరా చేయడం జరుగుతుందని ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ అన్నారు. శనివారం చినవంక పంచాయతీ గుల్లలపాడులో ఇంటింటికి శుద్ధజలం సరఫరా ప్రాజెక్టు నీటిని ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్దాన ప్రజల కష్టాలు తెలుసుకున్న మంత్రి డాక్టర్‌సీదిరి అప్పలరాజు ఇటువంటి పథకం ప్రవేశ పెట్టి ఇంటింటికి శుద్ధజలం సరఫరా చేయడం చాలా ఆనందంగా ఉందని, మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పి.గురయ్యానాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు దువ్వాడ మధు, జోగి అప్పారావు, ఉపసర్పంచ్ రెయ్యి శ్రీను, బగారి శ్రీకాంత్, కేశవలు పాల్గొన్నారు.

ఈనెల 8 పలాసకు చంద్రబాబునాయుడు రాక

విశాలాంధ్ర-పలాస : టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఈనెల 8 న పలాస వస్తున్నట్లు టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష తెలిపారు. పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో హెలిప్యాడ్, గౌతు నివాస గృహం వద్ద బహిరంగ సభ ఏర్పాటుకు శనివారం టిడిపి నాయకులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలాసలో ప్రజా గళం కార్యక్రమానికి చంద్రబాబు నాయుడు హాజరు అవుతున్నట్లు తెలిపారు. ప్రజా గళం కార్యక్రమంలో భాగంగా మహిళల సమస్యలు, వారి అభివృద్ధి వంటి అంశాలు, మహిళలతో ముఖాముఖి వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. వారితో పాటు టిడిపి పలాస నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు గురిటి సూర్యనారాయణ గాలి కృష్ణారావు బి నాగరాజు, టిడిపి మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్ కుమార్, డొక్కారి శంకర్, కొవ్వూరు సురేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆరవ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని రాజపురం ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం ఈశ్వరరావు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఎస్సీ,ఎస్టీలకు 75 రూపాయలు,ఓ.బీసీ,బీసీలకు 150 రూపాయలు ఆన్లైన్ లో రుసుము చెల్లించి ఈనెల 3వ తేదీ నుండి 31వ తేదీలోగా ఆన్లైన్‌లో (హెచ్‌టీటీపీఎస్://ఏపీఎంఎస్.ఏపీ. జీవోవీ.ఇన్/ఏపీఎంఎస్) వెబ్సైట్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ఐదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు వచ్చేనెల(ఏప్రిల్) 21వ తేదీన రాజపురం ఆదర్శ పాఠశాలలో పరీక్ష నిర్వహించబడునని తెలిపారు. ఈ అవకాశాన్ని ఆసక్తి గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.మరింత సమాచారం కొరకు6301062819, 9515544002 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

కిడ్నీ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ అమరావతి వారి ఆదేశము మేరకు శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా కిడ్నీ వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించే విధంగా పలు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక దశలోనే కిడ్నీ వ్యాధిని గుర్తించడం ఎలా అనే అంశంపై గోడపత్రికను ఆవిష్కరించారు. శ్రీకాకుళం జిల్లా ప్రజలందరూ కిడ్నీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండే విధంగా ఉండాలని సూచించే లా ఈ గోడపత్రికలు రూపొందించి జిల్లాలో అన్ని మారుమూల ప్రదేశాలకు వెళ్లే ఆర్టీసీ బస్సు లవెనుక అంటించి తద్వారా ప్రజలను చైతన్య పరచాలని శ్రీకాకుళం జిల్లా పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ ఏ. విజయ్ కుమార్‌ని కోరారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యం పట్ల ఏమాత్రం అలసత్వం వహించకుండా ఏమాత్రం ఆరోగ్యంలో తేడా కనిపించిన అర్హతగల డాక్టర్లను మాత్రమే సంప్రదించి వారు సూచించిన మందులు మాత్రమే వాడాలని, విచక్షణ రహితంగా పెయిన్ కిల్లర్లు వాడటం వల్ల కిడ్నీలు దెబ్బ తినే ప్రమాదం ఉందన్నారు. ప్రజలందరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ ఆర్ సన్యాసినాయుడు ఏపీఎస్ఆర్టీసీ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ రామారావు సంతాప సభను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-పలాస : సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన సంతాప సభ విజయవాడ ఎంబికె భవనంలో ఆదివారం ఉదయం పది గంటలకు ప్రారంభమవుతుందని, ఈ సంతాప సభను జయప్రదం చేయాలని కోరుతూ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయం పలాసలో శనివారం గోడపత్రికను జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు ఆవిష్కరించారు నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడం కోసం విద్యార్థి దశ నుండి రామారావు కార్మిక రంగంలో అవిరామంగా పనిచేసారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి అఖిలభారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు మామిడి భీమారావు, జిల్లా పి ఓ డబ్ల్యు కార్యవర్గ సభ్యురాలు తొంప సరస్వతి సవర బంగ్లా కుమార్ ఏఐకెఎంఎస్ నాయకులు పతివాడ షణ్ముఖరావు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరికీ ఇళ్ళు

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : రాష్ట్రంలో ప్రజలు సొంత ఇళ్ళు లేని స్థితిలో ఉండకూడదనే ఉద్దేశ్యంతోనే ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం ఇళ్ళ స్థలాలను అందిస్తుందని మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ అన్నారు. మండలంలో ముశ్చింద్ర గ్రామంలో శనివారం పర్యటించిన సందర్భంగా 65మందికి మంజూరైన ఇళ్ళ పట్టాలను అందజేసారు. ఈ సందర్భంగా సాయిరాజ్ మాట్లాడుతు గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని అన్నారు. నవరత్నాల పేరుతో పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలకు నగదు బదిలీతో పాటు పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందని ఉద్ఘాటించారు. ఆయనతో పాటు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పాతిర్ల రాజశేఖర్, నియోజకవర్గ, మండల, పట్టణ జే.సి.ఎస్ కన్వీనర్లు రాంపత్ని చిట్టిబాబు, ఆశి పురుషోత్తం, సాలిన డిల్లిరావు, కారంగి మోహన్ రావు, దక్కత నూకయ్య, ఉప్పాడ రాజు, సాడి గురుమూర్తి, పిట్ట విశ్వనాథం, బాకి లక్ష్మినారాయణ, రంగాల కృష్ణ, బుడ్డ కళ్యాణ్, సత్యం, కాళ్ళ నారాయణ, కాళ్ళ దేవరాజ్, సల్ల కృష్ణ, వలపల రమణ, ఇంద్రసేన, కారంగి త్రినాద్, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

చదువును బరువుగా కాకుండాలి బాధ్యతగా భావించండి

విశాలాంధ్ర-రణస్థలం : శ్రీ నారాయణ స్కూల్-కోస్ట నందు ఏర్పాటుచేసిన ఫేర్‌వెల్ డే వేడుకలులో మండల విద్యాశాఖ అధికారి త్రినాధరావు, ఎంఈవో-2 లావణ్య మరియు ఏఎస్ఐ రమణమూర్తి, ఎస్‌బీఐ కోస్ట మేనేజర్ సంతోష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎంఈవో త్రినాధరావు మాట్లాడుతూ చదువుని బరువుగా కాకుండా బాధ్యతగా భావించాలని కోరారు. ఎంఈవో-2 లావణ్య మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను పొందిన విద్యార్థులు మాత్రమే రాణిస్తారన్నారు. ఏఎస్ఐ రమణమూర్తి మాట్లాడుతూ సమాజం పట్ల, కుటుంబం పట్ల బాధ్యతగా వ్యవహరించి దేశాభివృద్ధికి పాటుపడాలని కోరారు. తదుపరి విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పిసిని చిన్నం నాయుడు, మాజీ సర్పంచ్ పిసిని జగన్నాథం నాయుడు, సర్పంచ్ ప్రతినిధి పిసిని లక్ష్మణరావు, పిసిని హరికృష్ణ, డైరెక్టర్ కెల్ల. మంజు భార్గవి, కరస్పాండెంట్ కెల్ల గోవింద, ప్రిన్సిపల్ ఎస్. గౌరు నాయుడు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయిని సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో గెలిచి జగన్‌కు బహుమతి : సాయిరాజ్

విశాలాంధ్ర-సోంపేట : రాబోవు ఎన్నికల్లో ఇచ్ఛాపురం నుంచి వైకాపా అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించి ముఖ్యమంత్రి జగన్‌కు బహుమతిగా ఇవ్వనున్నట్లు మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ పేర్కొన్నారు. ఈ మండలం ఉప్పలాం గ్రామంలో శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక సంక్షేమ పథకాలను ఇంటింటికి అందించడంతో పాటు గ్రామాల్లో తిరుగులేని అభివృద్ధిని చేపట్టి ప్రజల హృదయాల్లో వైకాపా ప్రభుత్వం చెరగని ముద్ర వేసిందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో వైసీపీ అభ్యర్థి గెలుపొందడం ఖాయమని అన్నారు. ఇప్పటి నుంచే బూత్ కమిటీలన్నీ మరింత శక్తివంతంగా పని చేసి ఓటర్లను చైతన్యపరుస్తూ ప్రతి ఓటు వైసీపీ అభ్యర్థికి పడేలా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఉప్పలాం గ్రామం నుంచి పది కుటుంబాలు వైసీపీలో చేరడంతో ఆయా కుటుంబాలను కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు, శిలగాన భాస్కరరావు, బుద్దాన శ్రీకృష్ణ బట్టి మాధవరావు, సూరాడ పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు సంభవిస్తే వెంటనే సమాచారం అందించాలి : ట్రాఫిక్ సీఐ అవతారం

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: ట్రాఫిక్‌లో ఏదైనా ప్రమాదం సంభవిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, గాయపడిన వారికి అత్యవసర చికిత్స అందే విధంగా ఆటో డ్రైవర్లు ఇతర వాహనదారులు ఈ నియమాలు పాటించాలని లేనియెడల కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని శ్రీకాకుళం ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ అవతారం తెలిపారు. గత 20 రోజులలో మూడు యాక్సిడెంట్లు బలగ, సూర్య మహల్ జంక్షన్, అరసవిల్లి టెంపుల్ వద్ద ప్రమాదాలు జరిగినా గుర్తు తెలియని వాహనముగా స్థానికులు చెప్పడంతో సిసి ఫుటేజ్ ఆధారంగా, వారిని గుర్తించి ఆటోలను స్వాధీనం చేసుకొని, డ్రైవర్లను అదుపులో తీసుకున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా ఆటో డ్రైవర్లు జాగ్రత్తలు వహించాలని లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ఆటో డ్రైవర్లతో ట్రాఫిక్ నిబంధనలపై తగు జాగ్రత్తలు తీసుకుంటామని ప్రమాణం చేయించారు. పట్టణంలోని పలు కూడళ్లలో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై ప్రసాదరావు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

సుదర్శన్ సేవలు మరువలేనివి

విశాలాంధ్ర-పలాస : గ్రేడ్ 1 పంచాయితీ కార్యదర్శి బొడ్డేపల్లి సుదర్శనరావు సేవలు మరువలేనివని పలాస ఎంపీడీవో మెట్ట వైకుంఠ రావు అన్నారు.శనివారం పలాస మండల పరిషత్ కార్యాలయంలో బొడ్డేపల్లి సుదర్శనరావు సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొడ్డేపల్లి అకాల మృతి కలచి వేసిందన్నారు. పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందించి అందరి మన్ననలు పొందారని గుర్తు చేశారు. తన విధి నిర్వహణలో ఎంతో మందికి ఎన్నో విధాలుగా ఆదుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ అనురాధ, పంచాయితీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు లండ శ్రీధర్, సుధాకర్, సద్గుణ బాబు, రవి కుమార్, రుపేంద్ర,, మీనా కుమారి, లక్ష్మణ్ రేఖా, ఆశ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

విశాలాంధ్ర-మందస : మహిళలు వైఎస్ఆర్ చేయూత ద్వారా ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఎపిఎం గొడబ ప్రసాదరావు అన్నారు. శనివారం రాయకోల గ్రామంలో వైఎస్ఆర్ చేయూత లబ్ధిదారుల సమావేశం నిర్వహించిన అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీన ప్రభుత్వం చేయూత నాలుగో విడత నిధులు మీ లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తున్నారని, ఈ నగదుతో చిన్నచిన్న వ్యాపారులు చేసుకొని ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సవర చంద్రమ్మ, ఎపిఎం ప్రసాదరావు, సర్పంచ్ సవర నవిత, వివోఏ జగబందు, చేయూత లబ్ధిదారులు పాల్గొన్నారు.

లేబర్ కాలనీలో గ్రంథాలయం ఏర్పాటు

విశాలాంధ్ర-పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ 20 వార్డు వార్డు లేబర్ కాలనీలో గ్రంథాలయం ఏర్పాటుకు ఆ వార్డు కౌన్సిలర్ అంబటి.మాధురి శనివారం భూమిపూజ చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల పాటు బీడి కార్మికులు కోసం గ్రంథాలయం ఏర్పాటు చేయాలని ఆలోచన కాలనీ ప్రజలకు ఉండేదని, ఎప్పుడు ఈ కార్యాచరణ ముందుకు పోలేదు, కొంతమంది పెద్దల సహకారంతో పూర్తిచేసి కార్మికుల పిల్లల భవిష్యత్ కు గ్రంథాలయం ఏర్పాటుకు అంకురార్పణ చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో శ్రీమంకినమ్మ తల్లి దాసురాలమ్మ బొంపల్లి. జయమ్మ, వార్డు పెద్దలు ధర్మాపు. విజయ్ కుమార్, గజ్జి. బాలయ్య, సమ్మన శాంతమూర్తి, చొక్కర ఈశ్వరరావు, దూపాన. కృష్ణారావు, కోనేరు. కాళిదాస్, ఎరగల్ల ధనరాజ్, కొల్లి ప్రశాంత్, తెప్పల. ధర్మారావు, పొట్నూర్ అచ్చుతరావు, ధర్మాపు శివ, శీగి కామేష్, పల్లి కామేష్, వలివేటి గణేష్, చొక్కర ధర్మారావులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బుల కోసం వేడుకోలు

విశాలాంధ్ర-జలుమూరు: ధాన్యం విక్రయించి నెల రోజులు గడుస్తున్నప్పటికీ డబ్బులు అందలేదని జలుమూరు మండలం పెద్దదూగాం గ్రామానికి చెందిన రైతు యాల్ల సింహాచలం ఆందోళన చెందుతున్నారు. ఇదే మండలం టెక్కలిపాడు రైతు భరోసా కేంద్రం ద్వారా జనవరి మూడో వారంలో 33 ధాన్యం బస్తాలు విక్రయించానని అన్నారు. మార్చి నెల వచ్చినప్పటికీ తన ఖాతాలో ధాన్యం డబ్బులు జమ కాలేదన్నారు. అధికారులు స్పందించి తన ధాన్యం డబ్బులు ఇప్పించాలని ఆయన వేడుకున్నారు.

ఘనంగా న్యూసెంట్రల్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు

- ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు
- వినయ, విధేయతలకు చిరునామా న్యూ సెంట్రల్ స్కూల్
- రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ పి. రజనీకాంత్ రావు

విశాలాంధ్ర-అరసవల్లి: శ్రీకాకుళంలోని స్థానిక పి.ఎన్ కోలనీలో గల న్యూ సెంట్రల్ స్కూల్ 1994 అంటే 30 సంవత్సరాల క్రితం రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్ మోహన్‌రావు స్థాపించిన ఈ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థానంలో నిలిచారని రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ పి. రజనీకాంత్ రావు అన్నారు. మార్చి 2 వార్షికోత్సవ వేడుకలను ఘనంగా శనివారం నిర్వహించారు. వార్షికోత్సవంలో భాగంగా ముఖ్య అతిధిగా పాల్గొన్న, రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ పి. రజనీకాంత్ రావుకు బుచ్చిబాబు స్కౌట్ పెరేడ్ తో గౌరవించి, జెండా ఆవిష్కరణతో కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులలో క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అందిస్తున్న న్యూ సెంట్ర స్కూల్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. వినయ, విధేయతలకు చిరునామా న్యూ సెంట్రల్ స్కూల్ అన్నారు. అలాగే పాఠశాలలో విద్యార్థుల కోసం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను పరిశీలించి అభినందిస్తూ ప్రతీ విద్యార్థిలో క్రమశిక్షణను, చూస్తున్నానని, విద్యార్థులు రేపటితరం నాయకులుగా తయారవటంలో ఉపాధ్యాయులు కీలకమన్నారు. అలాగే అతిధులుగా ఉన్న రెడ్ క్రాస్ చైర్మన్ పి. జగన్మోహన్ రావు, మేనేజింగ్ డైరెక్టర్ పి. రమాకుమారి, డైరెక్టర్లు పి.శ్రీకాంత్, పి. శ్రీదేవిలు సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించి, వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన పలు పోటీలలో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం జగన్‌మోహన్‌రావు విద్యార్థులనుద్దేశించి కష్టే ఫలి అని, కష్టపడి చదివితే తప్పకుండా విజయంతో మంచి స్థానంలో నిలుస్తారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ బలివాడ మల్లేశ్వర రావు మాట్లాడుతూ మారుతున్న కంప్యూటర్ విద్యప్రమాణాలకు అనుగుణంగా విద్యనందిస్తున్నామని, విద్యార్థులు చదువుతో పాటు, క్రీడా రంగాల్లోనూ, సాంస్కృతిగా రంగాల్లోనూ మా విద్యార్థులు రాణిస్తుండటం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా స్కౌట్ పరేడ్‌ను ఘనంగా నిర్వహించినందుకు బుచ్చిబాబును అతిరథ మహారథులందరు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కో-ఆర్డినేటర్ వై.వి.ఎస్.ఎం .మూర్తి,సరోజినీ, వెంకటరావు, యువ క్లబ్ గ్రూపులతో పాటు, జె.ఆర్సీ, ఎస్ జీసీ గ్రూపు సభ్యులు, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లితండ్రులు, స్థానికులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలుచేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదే : సర్పంచ్ పూడి లక్ష్మణరావు

విశాలాంధ్ర-కవిటి : ఎన్నికలకు ముందు వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలనే కాకుండా మరిన్ని పథకాలను అమలుచేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదే అని సర్పంచ్ పూడి లక్ష్మణరావు అన్నారు. ఈ మేరకు శనివారం కవిటి పంచాయతీ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు ఇళ్లస్థలాల పట్టాలను పంపిణీ చేపట్టారు. ఈసందర్భంగా సర్పంచ్ పూడి లక్ష్మణరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదలకు ఒక్క అంగుళం భూమిని కూడా ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. నియోజకవర్గంలో ప్రతిపక్ష పార్టీలు ప్రజలను మభ్య పెట్టి,అధికార పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. గత ప్రభుత్వంలో ఏమీ చేయలేదు కాబట్టే ప్రస్తుత ప్రభుత్వంపై నిందలు వేసి ప్రజలను తప్పుదారి పెట్టేంచేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శంచారు. అనంతరం కవిటి గ్రామ పంచాయతీ పరిధిలో 191 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను వైసిపి నాయకులతో కలిసి పూడి లక్ష్మణరావు ఇంటి స్థల రిజిస్ట్రేషన్ హక్కు పట్టాలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మర్రి లక్ష్మి,ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి,ఈ ఓ పి అర్ డి శివాజీ పాణీగ్రాహి, ఈవో జి వీరభద్ర స్వామి,ఎంపీటీసీ సభ్యులు పూడి నీలాచలం, మండల కోప్షన్ సభ్యులు పాండవ చంద్రశేఖర్, ఉపసర్పంచ్ ప్రతినిధి దేవాది దుర్యోధన,బెందాలం వెంకటరమణ, బర్ల నాగ భూషణరావు, వార్డు సభ్యులు, సచివాలయం సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, వాలంటీర్స్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మాణిక్యపురంలో.. మండలంలోని మాణిక్యపురం గ్రామంలో పిఎసిఎస్ అధ్యక్షులు దేవరాజ్ సాహు ఆధ్వర్యంలో నవరత్నాలలో భాగంగా వైఎస్ఆర్సిపి ప్రభుత్వం అందజేస్తున్న జగనన్న కాలనీ ఇళ్ల స్థలాల పట్టాలను శనివారం లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఏ విజయ్,వీఆర్వో వజ్జ గిరి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నార ఉత్పత్తుల వినియోగం పెంచాలి

- వ్యవసాయ పరిశోధన కేంద్రం పాలకమండలి సభ్యులు

విశాలాంధ్ర-ఆమదాలవలస : నార పంటల నుండి తయారుచేసిన ఉత్ప త్తులను, వాటి వినియోగాన్ని పెంచాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ ఎన్ మల్లికార్జున రెడ్డి, డాక్టర్ బి. శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక వ్యవసాయ పరి శోధన కేంద్రం ఆమదాలవలసలో గోగు, ఇతర నార పంటలపై జరుగుతున్న వివిధ పరిశోధన, విస్తరణ అంశాలను పరి శీలించారు. అనంతరం ఆత్మ శ్రీకాకుళం సౌజ న్యంతో నిర్వహిస్తున్న నార ఉత్పత్తుల విలువ జోడింపు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రస్తుతం ప్లాస్టిక్ వినియోగం బాగా పెరుగుతున్న నేపథ్యంలో ప్లాస్టిక్ ప్రత్యామ్నాయంగా నార పంటల నుండి తయారుచేసిన వివిధ ఉత్పత్తులను వాడుకోవాలని సూచించా రు. దీనివల్ల పర్యావరణ కాలుష్యం తగ్గడంతోపాటు నార పంటల సాగు చేసే రైతులకు మంచి ఆదాయం లభిస్తుందని తెలిపారు. శిక్షణలో పాల్గొన్న మహిళలు తయారుచేసిన వివిధ ఉత్పత్తులను పరిశీలించి అభినందించారు. అంతే కాక గ్రామాల్లో ఉండే మహిళలకు ఉపాధి అవకాశం కలుగుతుందని తెలి యచేశారు. ఆత్మ పథక సంచాలకులు డాక్టర్ రామచంద్రరావు పాల్గొని నార ఉత్పత్తులకు మార్కెట్లో మంచి గిరాకీ ఉందని రైతులు నార పంటల సాగు పై దృష్టి సారించి విస్తీర్ణం పెంచాలని సూచించారు. పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డా. చిట్టిబాబు, డా.స్వాతి, డా.శ్రీనివాసరావు, రాగోలు కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పివి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపి, వివేకా హత్యలో జగన్ పాత్రపై విచారణ చేయాలి

మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

విశాలాంధ్ర-నరసన్నపేట : కడప మాజీ పార్లమెంట్ సభ్యులు, దివంగత వై.ఎస్.వివేకా నందరెడ్డి హత్య కేసులో సిఎం, వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి పాత్ర అనుమానస్పదంగా వుందని, నేటి వరకూ ఈ హత్య విషయమై ఎటువంటి కదలిక లేదని, వివేకా హత్యకు జగన్మోహన్‌రెడ్డి పాత్రధారి, సూత్రధారని మాజీ ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి ఆరోపించారు. శనివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమణమూర్తి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఏర్పడి ఐదు సంవత్సరాలు అవుతున్నా ఈ హత్యపై ఎటువంటి పురోగతి లేదని, సిఎం, ఈ విషయమై గతంలో జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ బాబాయిపై ఐదు గాట్లు వున్నాయని చెప్పటంపై ఆయనకు హత్యతో సంబంధముందని తేటతెల్లమవుతోందని తెలిపారు. అలాగే రానున్న రోజుల్లో వైసిపి అధికారంలోకి వస్తే గూండాయిజం చేస్తామని చెపుతున్నారని, రాష్ట్రంలో అంబేద్కర్ వ్రాసే రాజ్యాంగం అమలు కావటం లేదని, స్వంత చెల్లెలికి, తల్లికి న్యాయం చేయలేని వ్యక్తి రాష్ట్ర ప్రజలకు ఎలా న్యాయం చేస్తారని ప్రశ్నించారు. అంతేకాకుండా వివేకానందరెడ్డి కుమార్తె అయిన సునీతాకు రాష్ట్రంలోని 5కోట్ల మంది ప్రజలు సంఘీభావం తెల్పి, జగన్మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో ఇంటికి పంపించే భాధ్యత రాష్ట్ర ప్రజలపై వుందని రమణమూర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, శిమ్మ చంద్రశేఖర్, గొద్దు చిట్టిబాబు, కింజరాపు రామారావు, రోణంకి కృష్ణంనాయుడు, బోయిన ఆనందరావు, పీన కృష్ణ పాల్గొన్నారు.

పనుల్లేని కూలీలకు ఉపాధి హామీ పనులు ఎంతగానో తోడ్పడతాయి

విశాలాంధ్ర-కవిటి: గ్రామాలలో పనులు లేని కూలీలకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనులు ఎంతగానో తోడ్పడుతాయని జిల్లా పరిషత్ చైర్పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా విజయ సాయిరాజ్ అన్నారు. ఈ మేరకు మండలంలోని కుసుంపురం, మాణిక్యపురం, ఇద్దివానిపాలెం, కవిటి పంచాయతీ లోని కొత్తపాలెం గ్రామంలో పర్యటించి ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధి హామీ కూలీల పనిదినాలు, వసతులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ కూలీలు ఎండవేడిమికి గురికాకుండా ఉదయం పూటే వచ్చి సకాలంలో పనులు పూర్తి చేసుకోవాలని తెలిపారు. వారి కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు దేవరాజ్ సాహు, కవిటి మేజర్ పంచాయతీ సర్పంచ్ పూడి లక్ష్మణరావు, కుసుంపురం, ఇద్దివానిపాలెం సర్పంచ్లు ఊర్మిళ శివ బిసాయి, గండుపల్లి రమేష్, ఎంపీటీసీ సభ్యులు కర్రి పద్మ సత్యనారాయణ, ఇద్ది హనుమంతు, నల్లన శ్రీను, పార్టీ ముఖ్యనాయకులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి కోసం చంద్రబాబుని గెలిపించాలి

విశాలాంధ్ర-జలుమూరు/సారవకోట: రాష్ట్ర అభివృద్ధి కోసం వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుని గెలిపించాలని శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్నాయుడు పిలుపునిచ్చారు. శనివారం సారవకోట మండల కేంద్రంలో జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన మాట్లాడారు. జగనన్న ఐదేళ్ల పాలనలో రాష్ట్రానికి శాశ్వత రాజధాని లేకుండా పోయిందని చంద్రబాబు తోనే శాశ్వత రాజధాని నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. నరసన్నపేట మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఉన్నారు.

ఈ-క్రాప్ ద్వారానే లబ్ధి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : కష్టించి పంటలు పండించుకునే రైతులు ప్రభుత్వం ద్వారా పరిహారాలు పొందడానికి ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి అని మండల వ్యవసాయాధికారిణి భార్గవి అన్నారు. మండంలో పలు రైతు భరోసా కేంద్రాల వద్ద శనివారం ఈ-క్రాప్ జాబితాలను ప్రదర్శించారు. ఆయా గ్రామ సర్పంచ్‌లు, ఎమ్పీటీసీలు, రైతు సంఘాల ప్రతినిధులు ఆధ్వర్యంలో జాబితాలను ప్రదర్శించారు. తేలుకుంచి గ్రామంలో ఆమె మాట్లాడుతు ఈ నెల మూడవ తేదీ వరకూ జాబితాలను ప్రదర్శిస్తామని అభ్యంతరాలు ఉంటే సంబంధిత వ్యవసాయ సహాకులను సంప్రదించాలని కోరారు. ఈ-క్రాప్‌లో నమోదు చేసుకున్న వారికి మాత్రమే పంట నష్టం, పంట ఋణాలు, సున్నా వడ్డీ మంజూరు, క్రాప్ ఇన్సూరెన్స్ వర్తించడంతో పాటు పంటను అమ్ముకునే వీలుంటుందని పేర్కొన్నారు. అభ్యంతరాలను పరిశీలించి తుది జాబితాలను 7వ తేదీన మరోసారి రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శిస్తామని చెప్పారు.

అడుగంటిన జలం... ఆందోళనలో జనం

- సోంపేట, కంచిలి పట్టణాల్లో తప్పని రెండవ బోర్‌వెల్స్

విశాలాంధ్ర-సోంపేట : ఏడాది కాలంకు పైగా పై నుంచి చినుకు రాలకపోవడంతో వ్యవసాయం బాగా దెబ్బతిన్న సంగతి అలా ఉంచితే అన్నింటికైనా ముఖ్యమైన తాగునీటికి జనం అప్పుడే అష్టకష్టాలు పడుతున్నారు. భూగర్భ జలాలు బాగా అడుగంటడంతో బోర్‌వెల్స్‌కు నీరందక జనం బెంబేలెత్తుతున్నారు. సోంపేట, కంచిలి పట్టణాల్లో ఈ పరిస్థితి పట్ల ప్రజల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇంచుమించుగా ఈ రెండు పట్టణాలే కాకుండా చుట్టుప్రక్కల ప్రాంతాల్లో గల గ్రామాల్లో కూడా ఇదే దుస్థితి నెలకొంది. దీని పట్ల ప్రజల్లో మంచినీటి కోసం ఏమి చేయాలో తెలియని అయోమయం నెలకొంది. బోర్‌వెల్స్ ద్వారా నీరు రాకపోవడంతో పట్టణాల్లో నివశిస్తున్న అనేక మంది ఇప్పటికే అధిక మొత్తంలో పెట్టుబడులకు వెనుకాడకుండా రెండవ బోర్‌వెల్స్‌ను నిర్మాణం చేపడుతున్నారు. ఇప్పటికే తడిసి మోపెడైన బోర్‌వెల్ నిర్మాణం వ్యయాన్ని భరిస్తున్నారు. ఈ ఏడాది కూడా వేసవి ప్రతాపం తీవ్రంగా ఉన్నట్లు జనవరి నుంచే వాతావరణ పరిస్థితులు హెచ్చరిస్తున్న సంగతి అందరికీ తెల్సిందే. మార్చి మొదటి వారంలోనే ఉదయం వేళ బయటకు వెళ్లాలన్నా ముఖం మాడిపోయే పరిస్థితులు నెలకొంటున్నాయి. ఉష్ణోగ్రతలు రానురాను తీవ్రమయ్యే పరిస్థితుల్లో భూగర్భ జలాలు మరింతగా దిగజారిపోయి మంచినీటి కష్టాలు మునుపెన్నడూ లేని విధంగా తీవ్రమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీంతో ఇప్పటికే మంచినీరు అందించే బావులు, బోరుబావులు అనేక చోట్ల ఇబ్బంది పెడుతుండగా చెరువులు, గుంటల్లో ఎక్కడా చుక్క నీరు లేని పరిస్థితి దాపురించింది. గత ఖరీఫ్‌లో వ్యవసాయం లేక నానా అవస్థలు పడుతున్న రైతు కుటుంబాలకు మూలిగే నక్కపై తాడిపండు పడ్డట్టు ప్రస్తుతం తాగేందుకు మంచినీరు కూడా దొరక్క నానా అవస్థలతో ఇప్పుడే ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. సోంపేట, అటు కంచిలి మండలాల్లో గల సుమారు 60 పంచాయతీ గ్రామాల్లో లక్షలాది జనాభాలో సుమారు 50 శాతం ప్రజలు మంచినీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారంటే అతిశయోక్తి కాదు.

నామమాత్రంగా నీటి పథకాలు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రబలిన కిడ్నీ వ్యాధుల నివారణ లక్ష్యంగా వందల కోట్ల రూపాయలు వెచ్చించి చేపట్టిన హిరమండలం రిజర్వాయర్ నీటి సదుపాయం పూర్తిగా ప్రజలకు చేరేందుకు ఇంకా కనీసం ఏడాది కాలం పట్టవచ్చని తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇందుకు సంబంధించిన పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం పని చేస్తున్న ఉద్దానం ప్రాజెక్టు పరిస్థితి డోలయామానంలో పడింది. ఎక్కడికక్కడే తరచూ మరమ్మతులు, విద్యుత్ సరఫరాలో ఆటంకాలు, అధికార యంత్రాంగంలో సరైన శ్రద్ధ లేకపోవడం, కాంట్రాక్ట్ సిబ్బందికి ఏళ్ల తరబడి వేతనాలు చెల్లించకపోవడం ఇటువంటి కారణాలతో ప్రస్తుతం సరఫరా చేస్తున్న నీరు అంతంత మాత్రంగానే ఉందని చెప్పవచ్చు. ఏ గ్రామానికి ఎప్పుడు నీరు వస్తుందో, ఎప్పుడు ఆగిపోతుందో, ఎన్ని రోజుల వరకు సరఫరా నిలిచిపోతుందో కనీసం సిబ్బంది కూడా చెప్పలేని పరిస్థితిలో ఉద్దానం పథకం కొట్టుమిట్టాడుతుంది. వచ్చిన నీరు కూడా అపరిశుభ్రంగా ఉంటూ తాగునీరుకు అసలు ఉపయోగపడడం లేదంటే అతిశయోక్తి కాదని చెప్పవచ్చు. ఈ పరిస్థితుల్లో ప్రైవేటుగా కొనుగోలుకు ప్రజలు ప్రాధాన్యత ఇవ్వక తప్పడం లేదు. గతంలో రెండు రూపాయలకే అందించే సుజల వాటర్ ప్రస్తుతం ఏడు రూపాయలకు చేరినా ప్రజలు అసంతృప్తితోనే కొనుగోలు చేయక తప్పడం లేదు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రైవేటు వ్యాపారులు కల్తీ నీళ్ల వ్యాపారంతో దండిగా దండుకుంటున్న సంగతి బహిరంగ రహస్యం. ఈ పరిస్థితుల్లో లక్షలాది రూపాయల వ్యయానికి కూడా లెక్క చేయకుండా అడుగంటిన భూగర్భ జలాల నేపథ్యంలో కొత్త బోర్ల నిర్మాణానికి 200 అడుగులకు పైగా తవ్వకాలు జరుపుతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అయినా సరే అనేక మంది అప్పటికీ నీరు లభించక నిర్మాణానికి చేసిన వ్యయమంతా వృధా కావడంతో ఆయా కుటుంబాలు పడుతున్న వేదన అంతా ఇంతా కాదు. ఈ పరిస్థితిని నివారించేందుకు అధికార యంత్రాంగంతో పాటు ప్రజాపాలకులు ప్రస్తుత వేసవి దృష్ట్యా ఎటువంటి చర్యలు చేపడుతున్నారో చూడాల్సి ఉంది.